




**-14-**

## తెలుగు సాహిత్యంలో తొలి కవయిత్రి – తాళ్ళపాక తిమ్మక్క

తెలుగు సాహిత్య వనంలో స్త్రీ కవయిత్రులలో మనకు తెలిసి మొల్ల ప్రథమ కవయిత్రి. మొల్లకు పూర్వము వయిత్రులున్నారని మనకు వేటూరి ప్రభాకర శాస్త్రి గారు చెప్పే వరకూ తెలియదు.

మొల్లకు పూర్వమున్న తెలుగు కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్క. ఆమె రచించిన కావ్యం 'సుభద్రా కళ్యాణం'. ఈ కావ్యము మునుపు మరుగునపడింది. దీనిని బయటకు తీసుకువచ్చి ప్రచురించినవారు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు.

తాళ్ళపాక వంశం సాహిత్యమును అవుపోసన పట్టిన వంశం. అందరూ కవులు, కవయిత్రులే. వారిలో ముఖ్యులు పదకవితా పితామహులు, శ్రీ వేంకటేశ్వరుని పరమ భక్తుడు,సంకీర్తానాచార్యుడైన తాళ్ళపాక అన్నమయ్య. ఆయన మొదటి భార్య తిమ్మక్క లేదా తిరుమలమ్మ.

అన్నమాచార్యులు 1424 – 1503 మధ్య కాలము వాడని నిరూపించబడింది. అన్నమయ్య భార్యగా తిమ్మక్కదీ ఇదే కాలమవుతుంది కదా!

ఆమె రచించిన ద్విపద కావ్యము 'సుభద్రా కళ్యాణం'. అది మంజరీ ద్విపదలో సాగే కావ్యము. ప్రాస ఉంటే ద్విపద. ఇందు ప్రాస లేనందున ఇది మంజరీ ద్విపద. పాడుకోవటానికి వీలుగా ఉంటుంది. స్త్రీ సౌకుమార్యములైన లలిత లలిత పదాలతో అల్లనల్లనగా సాగుతుంది ఈ కావ్యము.

"శ్రీరమా వల్లభులు – శ్రీకృష్ణ లెలమి
ద్వారకాపట్టణము – తమ రేలుచుండ

శ్రీకాంతపతికృపను – జెలగి పాండవులు
ప్రాకటంబుగను ద్రౌ– పది బెండ్లాడి
సంతసంబున నున్న – సమయంబునందు”

అంటూ మొదలవుతుంది. ఇది ద్విపద కావ్యమైనా మొదలు పెట్టిన ఎత్తుగడతోనే కావ్యమును సూటిగా వస్తువులోకి నడిపించింది కవయిత్రి.

ఆమె శైలి సూటిగా ఉంది. తడబాటు ఒడిదొడుకులు లేవు. సున్నితమైన పదాలతో కూడి చెప్పదలిచినదానిని హంస నడకలతో నడిపిన ద్విపద ఇది.

శ్రీకృష్ణుల వారు ద్వారకా నగరములో ఉన్న కాలములో, ద్రౌపదిని వివాహము చేసుకొని పాండవులు ఐదుగురు కాపురం మొదలెట్టారు. ఆ సమయంలో నారదులవారు వీరి వద్దకు వచ్చారు.

“సుదతికై సుందోవ– సుందుల చరిత
విదితముగ జెప్పెదను – వినుడంచు బలికే..”

నారదులు వచ్చి వీరితో సుందోపసుందుల చరిత్ర ఉదహరిస్తూ, స్త్రీ వల్లనే ఎంతటి వారికైనా గొడవలు తప్పవని, కాబట్టి దౌపద్రితో ఏడాదికి ఒకరుండమని, ఆ ఏడు మిగిలిన నలుగురు అటు చూడవద్దని, ఈ నియమము తప్పిన వారు తీర్థయాత్రలుకు వెళ్ళాలని సలహా ఇవ్వటముతో ద్విపద మొదలవుతుంది.

తదనంతరం అర్జునుడు భూసురుని గోవును రక్షించటానికి వెళ్ళటానికై ఆయుధముల కోసం ఆయుధశాలకు వెడుతూ ధర్మజుడు– ద్రౌపదితో ఉండటము చూడటము తటస్థపడుతుంది.

“ఆయుధశాలకు నరుగంగవలసి
ధర్మనందనుడు తా ద్రౌపతి గూడి
శూర్మితో నుండుట గూడ గుర్తించి..”

వారి ఒప్పందము ప్రకారము తీర్థయాత్రలకు బయలుదేరుతాడు.

వెళ్ళనవసరములేదన్న ధర్మరాజు మాటకు

“మనము గావించిన మర్యాద లన్ని
మనమె చెయ్యకయున్న మరి ధర్మమేది?” అంటూ తీర్థయాత్రలకు వెళ్ళిపోతాడు.

ఇది మనకు తెలిసిన కథే కదా. అయినా చదువుతుంటే ఆనందము కలుగుతుంది. చకచకా చదవాలన్న ఉత్సుకత కలిగిస్తుంది కవయిత్రి.

తిమ్మక్క ఈ ద్విపదను నన్నయ్య తెనుగించిన భారతము నుంచే గ్రహించింది. నన్నయ్య తెనుగించిన మహాభారతములో, ఆది పర్వంలో విజయవిలాసమన్న 135 గద్యపద్యాల భాగము ఆమె ఈ రచనకు ఆధారము. విజయుడైన అర్జునుని తీర్థయాత్రా విశేషాల వివరణయున్న భాగము. ఈ విజయవిలాసమును స్వీకరించి 1163 పాదాల ద్విపదగా తిమ్మక్క రచించినది. మంచి తేట తేనె తెలుగులో పాటలా సాగుతుందీ కావ్యము.

అర్జునుడు కొద్ది పరివారముతో ప్రయాణము చెయ్యటము. ఉలూచిని గ్రహించటము. సరస్సులో దిగి మొసలిని చంపి దేవకన్యకు శాపవిమోచనము చెయ్యటము చకచకా సాగిపోతుంది.

కృష్ణుని సలహాతో ద్వారకకు వస్తాడు మౌని వేషములో అర్జునుడు.

బలరాముడు ఆ మునిని స్వాగతించి, సుభద్రను పరిచర్యలు చెయ్యమని చెబుతాడు.

సుభద్ర పరిచర్యలు చెయ్యబోవ ఆమెతో

"తెరయొద్ద నిలుచుండి దేవేంద్రసుతుడు
సరసిజవదనతో సరసమ్ములాడు
భావగర్భతముగా పలుకు మర్మములు..."

ఆమెతో సరస సంభాషణలు మొదలుపెడతాడు. ఆ ముని వివరాలు తెలియని సుభద్ర కంగారుపడి అన్నగారైన కృష్ణుని వద్దకు వెళ్ళి చెబుతుంది.

"సరసమాడగ వచ్చు సారె నాతోను
సొంపు నొయ్యారంపు –చూపులే తరచు...
కటకట యిటువంటి కపట సన్యాసి
నెటులవలె బూజింతు నిందిరారమణ"... అంటూ చెబుతుంది.

చెల్లిని ఓదార్చి పంపి, ఆ కపట సన్యాసి వద్దుకు వెళ్ళి "పెద్దలు మీరింత బుద్ధి దప్పినను
సుద్దుల నందరు చులుకగ నగరె" అని సుద్దులు చెబుతాడు కృష్ణుడు.

సుభద్రను పిలిచి చేర కూర్చోబెట్టుకు ముద్దుగా బుద్ధి చెప్పేటప్పుడు కవయిత్రి ఆ గారాబమును అద్భుతంగా వివరించింది.

"శిరను వంచుకు యున్న చెల్లెలి జూచి
నయతోడ బిలిచే నా త్రైలోక్య పతియు
అమ్మరా ముద్దుల గుమ్మ రా వేగ
కొమ్మరా ననకంపు బొమ్మ రావమ్మా
ముత్యాల సరమరా ముద్దరాలా రా
చిత్తజు బాణమా చెలియ రావమ్మ.." ఇలా సాగుతుంది
ఇలా పిలిస్తే సుభద్ర
"హంస నడకలతో నతివ సుభద్ర
అల్లనల్లన వచ్చె అన్న ముందరికీ" చెల్లిని ఊరడించి నే చెబుతా నీవు పోమ్మని చెప్పి పంపుతాడు కృష్ణుడు.
ఇలా ఈ కావ్యమంతా  పాటలాగా సాగుతుంది. చదువరులకు చదివేకొద్దీ ఉత్సాహము వస్తుంది.

జానపదులు పాడుకునే జనపదాలు లేదా పాటలు విస్తారమైన సాహిత్యము.
ఆ సాహిత్యానికి లిపి లేదు. ఆ జానపదాలు పెద్ద పెద్ద పాటలు. పల్లవులు చరణాలు లేనివి. ఆ కోవలోకి వచ్చేలా తాళ్ళపాక తిమ్మక్క తన సుభద్రా కల్యాణము రచించింది. ఈ కావ్యము పాటయని, కావ్యము కాదని ఆమె చెప్పుకున్నారు. పాటకు ఆనాడు ఉన్న జనప్రాచుర్యాన్ని బట్టి ఆమె అలా చెప్పి ఉండవచ్చు కానీ, ఇది ద్విపద కావ్యమే.

బావా, బావమరుదుల సంబంధము తెలుగువారికి ఎంతో ఉత్సాహమిచ్చే బంధాలలో ఒకటి. వారి మధ్య సున్నితమైన హాస్యము, ఎగతాళి సామాన్యము. అందుకే కాబోలు తిమ్మక్క, నన్నయ్య భారతములో లేని బావ, బావ మరుదుల హాస్యమును ఈ కావ్యములో గుప్పించింది.

తీర్థయాత్రలు చేస్తూ అర్జునుడు ద్వారక వైపు వెడుతుంటే కృష్ణుడు ఎదురొస్తాడు. ఆ సందర్భములో వెల్లివిరిసినదంతా బావ బావమరదుల హాస్యమే.

" నరుదు నచ్చెరు వంది నారాయణునకు
సరగున ప్రణమిల్లి సభక్తి మొక్కి
వనమాలికెదురుగా వచ్చి యర్జునుడు

దండ ప్రణామమ్ము తగ నాచరించె
నారాయణా యనుచు నవ్వుచు నరుడు
కరము బట్టుక వాని కడు లేవ నెత్తె
హరియు నవ్వుచు బల్కె నర్జుని జూచి
నిన్ననే సుతుల గని నెఱతనమునను
యింతలో సన్యాసి వెట్లయితి వయ్య
యెరుగుచుము ఈ విద్య లెల్లను మేము
గరిమ వేసాలెల్ల గ్రాసాల కొఱకె
అని గేలి సేయుచు....”

నిన్ననే కదా పిల్లాడ్ని కన్నావు. అంటే అంతకు మునుపే బభ్రువాహనునికి తండ్రి అయ్యాడు అర్జునుడు. అలాంటి శృంగార పురుషుడవు ఇలా సన్యాసి వేషమేశావు అని మేళమాడుతున్నాడు నారాయణుడు. వేషాలన్నీ భోగము కోసమే కదా అంటూ హాస్యమాడు శ్రీకృష్ణుడు.

ఇంకో విశేషమేమంటే అర్జునుని యత్రాస్థలి. అర్జునుని యాత్ర గంగా, రైవ తీరాన సాగుతుంది వ్యాస భారతములో. నన్నయ్య వ్యాసభారతంలో లేని గోదావరి నది వద్దకు, వేంగి క్షేత్రానికి తీసుకు వచ్చాడు అర్జునుని. ఆయన గోదావరి తీర నివాసి కావటము వలన కాబోలు.
తిమ్మక్క ఈ విషయములో మరింత స్వేచ్ఛ తీసుకొని అర్జునునిచే దక్షిణ దేశ యాత్ర చేయించింది.
“చనుతెంచె పర్వ స్వామి సన్నిధికి
అమర సహోబళం బా వెంకటాద్రి
వరుస నా పై కంచి వరదుల గొలిచె
క్రమమున కావేటి రంగనాయకుల
ప్రేమను దర్శించి పిదప తానంత
అల దక్షిణమ్మున వెలసిన యట్టి
అలతి నదుల తీర్థ ములనాడే క్రీడి....”
ఇలా అర్జునుడిని దక్షిణ దేశ యాత్ర చేయించింది కవయిత్రి. ఆమె మరి తిరుపతి వద్దనున్నది కదా!

చక్కటి ఉపామానాలతో, ముద్దులొలుకు రచన చేసిన తిమ్మక్క ద్విపద తదనంతరపు కవులకు దారి చూపింది. పద్ధెనిమిదవ శతాబ్ధపు వాడైన చేమకూర వేంకట కవి ఆమె రచన నచ్చి, అందులోని కొన్ని యధాతథంగా తన పద్యాలలో వాడుకున్నాడు.

తిమ్మక్క అర్జునుని వర్ణిస్తూ–
"యెగు భుజమ్ముల వాడు మృగరాజు నడుము
నడచి పుచ్చుకొనునె న్నడుము గలవాడు
గరగరని వాడు చక్కని వాడు నతడు
గొప్ప కన్నుల వాడు కోదండ గుణికి
ణాంకంబు లౌ బాహు లమరిన వాడు
వెన్నునా మచ్చ గల విభువంబువాడు
బవిరి గడ్డము వాడు పన్నిదం బిడిన
వెన్ను పడగసాల వెసనాడవచ్చు"...
విజయవిలాసములో చేమకూర కవి ఇవే మాటలు వాడుతూ –
సీ. ఎగు బుజంబుల వాడు మృగరాజ
మధ్యంబు బుడికి పుచ్చు కొను నెన్నడుము వాడు,
నెటి వెంద్రుకల వాడు,
నీలంపు నికరంపు మెఱగు జామన
ఛాయ మేని వాడు, గొప్ప కన్నుల వాడు, కోదండ
గుణ కిణాం కములైన ముంజేతు లమరు వాడు,
బవిరి గడ్డము వాడు, పన్నిదం బిడి డాగ వచ్చు
నందపు వెన్ను మచ్చ వాడు,

తే.గరగరని వాడు, నవ్వు మొగంబు

వాడు చూడ గల వాడు, మేలైన
సొబగు వాడు, వావి మేనత్త కొడుకు కావలయు
నాకు, నర్జ నుండు పరాక్ర మో పార్జనుండు. ( విజయ విలాసము, ద్వితీయాశ్వాసం, 164 వ పద్యం)

ఇదే కాదు సుభద్ర కపట సన్యాసితో “తీర్థయాత్రలలో మీరు అర్జునుని చూచారా? “ అని అడిగినప్పుడు అర్జునుడు

“అమరగా బలికెను అతివతో నపుడు
కోమలి ఇద్దరము గోకర్ణమందు
కూడియే యుంటిమి కొన్నాళ్ళు లచట
భోజన్ములు శయనము లొకచోట
చెలియ యుంటుమి మేము చెలికాంద్రవలెను
అతనికి నాకునన నరమరలేదు
అతనికి నా కైక్య మతివరో వినవే”... అంటూ చెబుతాడు. ఇది తిమ్మక్క సృష్టి. దీనినే చేమకూర కవి తన విజయవిలాసములో చూపించినాడు.

“కోమలి యీగతిన్ మది దగుల్వడ బల్కిన నవ్వి నిర్జర
గ్రామణి సూను మీ రెచట గంటిరో యంటివి! కన్ను మాత్రమే
యే మని చెప్ప వచ్చు నొక యించుక భేదము లేక యాయనే
మేమయి యున్నవారము సుమీ వికచాంబుజపత్రలోచనా!”

“.... కూడి యతను మేము గోకర్ణము నయందు..” అని చెప్పటము చేమకూర కవిని తిమ్మక్క ద్విపద ఎంతగానో ప్రభావితం చేసిందనటములో సందేహము లేదు.

ఇది సహజము కూడా. చదివిన పూర్వపు కావ్యాలు కవులను ప్రభావితం చేసి, వారి రచనలలో ఆ ప్రభావము కనపడటము పూర్వం నుంచి ఉన్నదే.

ఇలా భవిష్యత్తు కవులను ప్రభావితం చెయ్యగలిగే రచన చేసిన తిమ్మక్క సామర్థ్యము ప్రశంసనీయమైనది.

తిమ్మక్క ఈ ద్విపద రచనలో అర్జునుడు సుభద్రతో కలిసి ఇంటికి వచ్చినప్పుడు వారిరువురినీ ద్రౌపది ఎదురెళ్ళి స్వాగతం పలికినదని చెబుతూ ఇలా అంటుంది...

"అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుని
చెల్లెలు గనుకనే నొల్లననరాదు
అది గాక సభలోన ఆ కౌరవులకు
మాన భంగం గల్గు హీన కాలమున
మాన ధన మొసగిన మాహత్మ్యశాలి
అటు వంటి శ్రీ కృష్ణు కనుగ చెల్లెలట"... అని అనుకుంటుంది.

అర్జున సుబధ్రలు వచ్చినప్పటికి మాయాజూదము జరగలేదు. ద్రౌపది అవమానము కాలేదు. కానీ భర్త మరో స్త్రీ తో వస్తే వారిని స్వాగతించటానికి తిమ్మక్కకు ఈ కారణము ఒక్కటి గొప్పగా తోచి ఉండవచ్చు. లేకపోతే ఇది ఈ కథాకాలానికి అసందర్భము అవుతుంది.

స్త్రీ హృదయము అవిష్కరించటానికి తిమ్మక్క ఈ సాకు చూపిందనుకోవాలి మనము.

తరువాతి కాలపు కవి చేమకూర కవి ని ప్రభావితం చేసిందంటే అప్పటికీ కావ్యము వెలుగులో ఉండి ఉంటుంది. తరువాత ఎలాగో లుబ్ధమైయ్యింది. మళ్ళీ శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి వలన వెలుగు చూసింది. తెలుగువారిలో ప్రథమ కవయిత్రిగా సరసమైన, సౌమ్యమైన లలిత లలిత సుకుమార ద్విపద రచించి తిమ్మక్క తెలుగుసాహిత్యం లో ప్రథమ కవయిత్రిగా గౌరవం పొంది ఘనకీర్తి నార్జించినది.

తిరుపతి తిరుమల దేవస్థానము వారు ఈ కావ్యాన్ని ప్రచురించి తెలుగుసాహిత్యపు వెలుగులను నలుదిశలా ప్రసరింపచేస్తున్నారు. అది అంతర్జాలములో లభ్యము.

Ref
సుభద్రా కళ్యాణము – తాళ్ళపాక తిమ్మక్క
ఆంధ్ర కవయిత్రులు – ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

Comments